క్లుప్తంగా

నూకాలమ్మతల్లి గుడి నిర్మాణం ప్రారంభం



నూకాలమ్మతల్లి గుడి పనులు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: స్థానిక పంచాయతీలో నూకాలమ్మతల్లి గుడి నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను సర్పంచ్ కసిపల్లి బుజ్జి ప్రారంభించారు. దీని నిర్మాణానికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కృషితో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. గ్రామస్తుల ఆరాధ్య దైవం కావడంతో ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసి భక్తుల దర్శనం కోసం ఆలయాన్ని అందుబాటులో ఉంచుతామని సర్పంచ్ తెలిపారు.

ఈ- క్రాప్ నమోదుతో రైతులకు మేలు



పాతమల్లంపేటలో ఈ - క్రాప్‌పై అవగాహన చేస్తున్న అధికారులు

గొలుగొండ: రైతులు పండించిన పంటలకు తప్పనిసరిగా ఈ- క్రాప్ చేయించుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వ ఫలాలకు దూరమవుతారని నర్సీపట్నం వ్యవసాయశాఖ ఏడీ శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె పాతమల్లంపేటలో ఈ - క్రాప్ విధానాన్ని పరిశీలించారు. ఈ - క్రాప్ వల్ల పంటకు నష్టం కలిగితే వెంటనే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుందని తెలిపారు. ఈ- క్రాప్ నమోదు చేయకపోతే రైతులకు ఎటువంటి పరిహారం, రాయితీలు అందవని తెలిపారు. ప్రస్తుతం వరి నాట్లు వేసిన రైతులు వ్యవసాయశాఖ సిబ్బంది ఇచ్చే సలహా, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

మాడుగుల రూరల్: గణిత ఉపాధ్యాయుడిని నియమించాలంటూ ఎం.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్ కోన అన్నపూర్ణ కోరారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు శనివారం ఉదయం వినతి పత్రం అందజేశారు. ఇక్కడ హైస్కూల్‌లో మూడు నుంచి పదో తరగతి వరకు 361 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరికి గణిత ఉపాధ్యాయుడు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

160 మందికి వ్యాధి నిరోధక టీకాలు

మాడుగుల రూరల్: మిషన్ ఇంద్రధనుస్సులో భాగంగా మండలంలో కింతలి, కేజేపురం పీహెచ్‌సీలకు సంబంధించి 23 సచివాలయాల పరిధిలో శనివారం 160 మందికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈవో తనిఖీ

రోలుగుంట: మేలైన బోధన అందించి తద్వారా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని ఎంఈవో-1 జానుప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. భోగాపురం, కంచుగుమల పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన మెనూ అమలు విధానాన్ని పరిశీలించి స్టాకును తనిఖీ చేసి రికార్డులతో సరిపోల్చారు. పాఠశాల నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ప్రైవేటుగా దీటుగా కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధన, సంక్షేమ పథకాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థుల ప్రవేశాలు పెంచాలన్నారు. ఉపాధ్యాయులు కిల్లాడ నాయుడు, రత్నం, నాగభూషణం పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల నిర్మాణాలన్నీ పూర్తి చేస్తాం

పీఎస్‌పేట, రాజాం వద్ద రోడ్ల పనులకు విప్ ధర్మశ్రీ శంకుస్థాపన



చోడవరం: పీఎస్‌పేట రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ కరణం ధర్మశ్రీ



బుచ్చెయ్యపేట మండలం రాజాం వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ ధర్మశ్రీ



జేసీబీతో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న విప్ ధర్మశ్రీ

చోడవరం: గ్రామీణ రహదారులన్నీ పూర్తిస్థాయిలో నిర్మించేందుకు అన్ని చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలంలో కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోక ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన పీఎస్‌పేట వయా జన్నవరం, కందిపూడి, బంగారుమెట్ట రోడ్డు పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ పనులకు ప్రభుత్వం రూ. 2.80 కోట్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నియోజకవర్గంలో పూర్తిగా దెబ్బతిన్నాయని, పీఎస్‌పేటరోడ్డుతోపాటు అనేక రోడ్లు పెద్దపెద్ద గోతులు పడి చాలా అధ్వానంగా తయారన్నాయన్నారు. ఈ నేపథ్యంలో సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో నియోజకవర్గంలో ప్రధాన లింకు రోడ్ల నిర్మాణానికి రూ. 25 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇప్పటికే పలు రోడ్లు నిర్మించామని, మిగతా వాటికి టెండర్లు పిలిచి పనులు చేపట్టామన్నారు. పీఎస్‌పేట రోడ్డు నిర్మాణంతో పది గ్రామాలకు ప్రధాన రహదారి సమస్య తీరుతుందని ధర్మశ్రీ చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, ఎంపీటీసీ పుల్రేటి శ్యామ్‌ప్రసాద్, సర్పంచ్‌లు పోతల జానకీప్రసాద్, మూడెడ్ల శంకరరావు, గొర్లె శ్రీనివాసరావు, బలిరెడ్డి నాగేశ్వరరావు, శీరంరెడ్డి వెంకటరమణ, మొల్లి ఈశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు, పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతీ చోట మొక్కలను నాటాలని ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అన్నారు. నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా చోడవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్క నాటారు. ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో చైతన్య, గాడి అప్పారావు, చోడవరం సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, ప్రధాన కార్యదర్శి పందిరి శ్రీనువాసరావు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం కన్వీనర్ పతివాడ అప్పారావు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నారాయణరావు, ఆర్‌ఆర్‌పేట కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు బొడ్డేడ సూర్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ పాల్గొన్నారు.

ఎర్రవాయి ప్రాంతానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తా

బుచ్చెయ్యపేట: మండలంలో వెనుకబడిన ఎర్రవాయి గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో ప్రజలకు రవాణా సదుపాయం కల్పిస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. రూ.1.80 కోట్లతో నిర్మించనున్న రాజాం వెదుళ్లగెడ్డ జంక్షన్ నుంచి పెదమదీన, గున్నెంపూడికి వెళ్లే రోడ్డు పనులకు శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న బుచ్చెయ్యపేట మండలంలోని పలు గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. మల్లాం వద్ద రెండు వేల ఎకరాలు, కొమ్మళ్లపూడి వద్ద 50 ఎకరాల స్థలాన్ని పరిశ్రమలు ఏర్పాటుకు భూములు కేటాయించామన్నారు. సరైన రోడ్డు సదుపాయం లేక పరిశ్రమలు ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ముందుగా రోడ్లను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డుకు రూ.110 కోట్లు, కశింకోట, బంగారుమెట్ట(కేబీ) రోడ్డుకు రూ.32 కోట్లతోపాటు రాజాం, తట్టబంద రోడ్డు, పెదమదీన, గున్నెంపూడి రోడ్డు, బుచ్చెయ్యపేట రోడ్డు నుంచి ఐయితంపూడికి, ఆర్టీ రోడ్డు నుంచి ఎస్ఎల్ నగర్‌కు, కేబీ రోడ్డు నుంచి గొన్నవానిపాలెం తదితర గ్రామాల రోడ్ల అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేయించి పనులు చేయిస్తున్నానన్నారు. ఈ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తే అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో రవాణా సదుపాయం కలిగి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చిన బా బు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, న్యాయవాది చొప్పా బాబూరావు, కోరుకొండ అప్పలనాయుడు, నమ్మి అప్పలరాజు, జోగా కొండబాబు, సుంకరి శ్రీను, గాంధీ, గొలజాన శ్రీను, డీఈ మోహన్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఎంఈవోకు ఘన సన్మానం



పూలమాలతో సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, ఉపాధ్యాయులు

కె.కోటపాడు: ఉపాధ్యాయులకు మార్గదర్శకునిగా ఉంటూ విద్యార్థులకు మంచి బోధన అందించేందుకు కృషి చేస్తున్న ఎంఈవో టి.మధుమూర్తి అభినందనీయుడని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ అన్నారు. కె.కోటపాడు ఎంఈవోగా పని చేసిన మధుమూర్తి ఇటీవల పెందుర్తి మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు శనివారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో మధుమూర్తిని ఘనంగా సన్మానించారు. పూలమాలతో సన్మానించి ఎంపీపీ జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణను అంకితభావంతో నిర్వహించే వారికి అన్ని వర్గాల వారి నుంచి మంచి గుర్తింపు దక్కుతుందన్నారు. అనంతరం ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన 60 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ సెక్రటరీ ఎంవీ కృష్ణకుమార్, ఎంపీడీవో శచీదేవి, ఎంఈవో- 1, 2 సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూర్రెడ్డి శ్రీనివాసరావు, పోతల నాయుడుబాబు, రాజాపంతుల సురేష్, ఇమంది ప్రవీణ్, వీరాంజనేయులు, అబద్ధం, బండారు పేరునాయుడు, ఈర్లి అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడం నిలిపివేత

ఎటువంటి పనులు చేయకుండా తహసీల్దార్ మహేశ్వరరావు ఆదేశాలు



అక్రమ కట్టడాన్ని నిలిపివేయిస్తున్న తహసీల్దార్ మహేశ్వరరావు, పార్టీ నాయకుడు సత్యదేవా

రావికమతం: కొత్తకోట మేజర్ పంచాయతీలో సర్వే నంబరు 244/2ఎలోని గయాళు భూమిలో అక్రమ కట్టడాన్ని తహసీల్దార్ మహేశ్వరరావు, పోలీసులు శనివారం అడ్డుకున్నారు. గ్రామ సచివాలయం-3 వద్ద కొంత ప్రభుత్వ గయాళు భూమి ఉంది. ఆ భూమిలో ఉప సర్పంచి దేవా, గ్రామానికి చెందిన వేమవరపు నానాజి ఆర్నెల్ల క్రితం షెడ్డు వేసేందుకు ప్రయత్నించగా వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్ముడు సత్యదేవ, శీలం శంకర్రావు తదితరులు అడ్డగించి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ ఎటువంటి పనులు చేపట్టినా చర్యలు తీసుకుంటామని అప్పట్లో తహసీల్దారు మందలించారు. ఆ స్థలాన్ని పందల దేవా వద్ద కొనుగోలు చేశానని సంబంధిత పత్రాలతో కోర్టుకు వెళ్లగా తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని నానాజి మరలా అక్రమ నిర్మాణానికి పూనుకున్నాడు. దాంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యదేవ ఫిర్యాదు మేరకు తహసీల్దార్ నేరుగా వచ్చి పనులను నిలిపివేయించారు. కోర్టు ఉత్తర్వులు 244/2బి సర్వే నంబరువని, ఇది ప్రభుత్వ భూమి అని, నిర్మాణ పనులు చేసిన వారు శిక్షార్హులంటూ మందలించారు. సదరు స్థలంలో అక్రమ కట్టడాలు చేస్తే చర్యలు చేపట్టాలని స్థానిక పోలీసులకు, వీఆర్‌వోకు ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు చేయడమే నేరమన్నారు.

ఆస్పత్రిలో ఎస్టీ సెల్ విభాగం ఏర్పాటుకు డిమాండ్



షెడ్యూల్ సాధన సమితి నాయకుడు గోవిందరావు

నర్సీపట్నం: స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చే గిరిజన రోగులకు ప్రత్యేక ఎస్టీ సెల్ విభాగం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన సంఘం కమిటీ అధ్యక్షుడు గోవిందరావు డిమాండ్ చేశారు. చింతపల్లి, కొయ్యూరు, జీకేవీధి, జి.మాడుగుల మండలాల నుంచి గిరిజనులను ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారన్నారు. పెదవలస ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థి అనారోగ్యానికి గురైతే అక్కడ వైద్యుల సూచన మేరకు ఇక్కడ ఆస్పత్రి తీసుకువస్తే, వైద్యులు బయట స్కానింగ్ చేయించాలని రసీద్ ఇచ్చారని వాపోయారు. స్కానింగ్‌కు రూ.2500 పెట్టే ఆర్థిక స్తోమత లేని కారణంగా తల్లిదండ్రులు వైద్యం చేయించకుండా ఇంటికి తీసుకెళ్లిపోయారన్నారు. బయట టెస్టులు చేయించాల్సి వస్తే ఐటీడీఏ నిధులతో చేయించాలన్నారు. ఇందుకు ఆస్పత్రిలో ప్రత్యేక ఎస్టీ సెల్ విభాగం ఏర్పాటు చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



చంద్రయ్యపేటలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్

దేవరాపల్లి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వి. రవీంద్రనాథ్ తెలిపారు. కాశీపురం పంచాయతీ శివారు చంద్రయ్యపేటలో జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, బిల్లులు సైతం సకాలంలో మంజూరు చేస్తున్నామన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని కాశీపురం సచివాలయ భవన నిర్మాణాన్ని, ఇంటింటా ఓటరు సర్వేను పరిశీలించారు. తహసీల్దార్ ఎం. లక్ష్మి, సూపరింటెండెంట్ జి.వి.రమణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గోవింద, పంచాయతీ సెక్రటరీ ఆర్. సత్యవతి పాల్గొన్నారు.

మాడుగుల: జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జి.ప్రభాకరరావు అన్నారు. శనివారం ఆయన ముకుందపురంలో జగనన్న లేఅవుట్లు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో సకల సదుపాయాలు కల్పిస్తున్నామని, ఇంకా ఇల్లు నిర్మాణం ప్రారంభించకపోతే అర్హత కలిగిన వేరే లబ్ధిదారులకు లేఅవుట్ కేటాయిస్తామన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులుతో సమావేశమయ్యారు. ఓటరు సర్వే వేగవంతంగా పూర్తి చేయించాలని ఆదేశించారు. ఎంపీడీవో మీనాకుమారి, తహసీల్దారు పీవీరత్నం, ఎన్నికల డీటీ పూర్ణయ పాల్గొన్నారు.

సందడిగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం



చోడవరంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

చోడవరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని చోడవరం డివిజన్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘ కార్యాలయంలో ఫొటోగ్రాఫర్లంతా కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని, ప్రత్యేక పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సంఘ భవనానికి స్థలం సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బొంగరాల సురేష్, ఉపాధ్యక్షుడు రాజాన శివకుమార్, కార్యదర్శి స్వామి పట్నాయక్, సంయుక్త కార్యదర్శ జి. సుధ, కోశాధికారి ఎ. తులసీరావు, సభ్యులు సతీష్, ప్రభాకర్, దుర్గారావు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై తల్లిదండ్రుల ప్రత్యేక దృష్టి



ప్రిన్సిపాల్ వెంకటరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నర్సీపట్నం: విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందన్నారు. పిల్లల పఠన సామర్థ్యాన్ని తల్లిదండ్రులకు తెలియజేసే ఉద్దేశంతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చనని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పిల్లల పరీక్షలకు సంబంధించిన ప్రొగ్రెస్ రిపోర్టును తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను సత్కరించారు.

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రోలుగుంట: శ్రీకాకుళం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 13న నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. ఎస్.కార్తీక్, జి.మోహన్ అర్జున్, ఎస్.కల్యాణ్‌రాజ్ సిల్వర్ మెడల్స్, ఎ.కుమార్‌నాయుడు, కె.వంశీ, పి.అరుణ్‌కుమార్, కె.సాయిబాబు, బి.లోహిత, బి.గుణశేఖర్, తదితరులు బ్రాంజి మెడల్స్ సాధించారు. వీరితోపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పీఈటీ ఎన్. గోవింద్‌ను హెచ్‌ఎం వరప్రసాద్, ఎస్.ఎం.సి. చైర్మన్ బండారు రామకృష్ణ, ఉపాధ్యాయులు కిరణ్, నానీ, సతీష్ తదితరులు శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు.

రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లు

నాతవరం: జిల్లాలో రాయితీపై బిందు, తుంపర్ల సేద్యం యూనిట్ల మంజూరు కోసం 489 మంది రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని జిల్లా సూక్ష్మ, సాగు నీటి వనరులు పథకం ప్రాజెక్టు డైరెక్టరు జి.వి.లక్ష్మి తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో ఆమె సమీక్షించారు. 1,562 హెక్టార్లలో రిజిస్ట్రేషన్లు చేశామని, ఇంతవరకు 582 హెక్టార్లలో పరిశీలన చేసి కలెక్టరుకు నివేదించామన్నారు. 212 హెక్టార్లలో యూనిట్ల మంజూరుకు ఆమోదించారన్నారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీడీవో హనుమంతరావు పాల్గొన్నారు.

3 ఓట్ల తేడాతో వార్డు మెంబర్ల గెలుపు



రాజేశ్వరికి నియామక పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి



కొండబాబుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నిక అధికారి సత్యనారాయణ

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే విజయం

గొలుగొండ: గాదంపాలెం పంచాయతీలో రెండో వార్డు మెంబరుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు తరుంబోయిన రాజేశ్వరి తన ప్రత్యర్థి అభ్యర్థి కొండమ్మపై మూడు ఓట్ల తేడాతో గెలుపొందింది. శనివారం వార్డు ఉప ఎన్నికల్లో 88 ఓట్లకుగాను 67 ఓట్లు పోలయ్యాయి. రాజేశ్వరికి 35, కొండమ్మకు 32 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి సీతామహలక్ష్మి ధ్రువీకరించారు. రాజేశ్వరికి నియామక పత్రం అందజేశారు. సర్పంచ్ నల్లబెల్లి శ్రీనువాసరావు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, మాజీ సర్పంచ్ రేచికట్ల అప్పారావు అభినందనలు తెలిపారు.

వార్డు మెంబర్‌గా కొండబాబు గెలుపు

నర్సీపట్నం: మెట్టపాలెం పంచాయతీ రెండో వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికలో పైల కొండబాబు గెలుపొందారు. మొత్తం 162 ఓట్లు పోలయ్యాయి. కొండబాబుకు 82 ఓట్లు, సమీప ప్రత్యర్థి బండారు రాంబాబుకు 79 ఓట్లు వచ్చాయి. మూడు ఓట్ల తేడాతో కొండబాబు ఎన్నికైనట్లు ఎన్నిక రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. కొండబాబుతో ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాన్ని అందజేశారు. సీఐ రమణయ్య పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వార్డు మెంబర్ల ఏకగ్రీవం

రావికమతం: మండలంలోని తట్టబంద 8వ వార్డు మెంబరుగా నమ్మి నాగమణి, కవగుంట 2వ వార్డు మెంబరుగా కంఠముఖి జానకి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చైతన్య శనివారం తెలిపారు. కవగుంట 2వ వార్డు మెంబరు కంఠముఖి శ్రీనివాసరావు అప్పట్లో కరోనాతోనూ తట్టబంద వార్డు మెంబరు అప్పలనాయుడు గుండెపోటుతోనూ గతంలో మృతి చెందారు. వీరి స్థానంలో తాజా నోటిఫికేషన్ ప్రాప్తికి పై అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు.

31 వరకే ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు

ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ చిట్టినాయుడు



చింతలూరులో టీకాలు వేస్తున్న సిబ్బంది

మాడుగుల: మండలంలో ఈ నెల 31వ తేదీ వరకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తామని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. మండలంలోని వీరవిల్లి అగ్రహారం, చింతలూరు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలుతాయన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ అందిస్తున్న సేవలు గురించి రైతులకు వివరించారు. పశువైద్య సహాయకులు ఆశ, మోదినాయుడు పాల్గొన్నారు.

కె.నాయుడుపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం

రోలుగుంట: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం కె.నాయుడుపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుములూరి బాబులు ప్రారంభించగా, పలు గ్రామాల నుంచి వచ్చిన 60 పశువులకు రోలుగుంట పశు వైద్యాధికారి నూకేశ్వర్రావు చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీనికి ముందు సీజనల్‌గా పశువులకు సంక్రమించే ముద్ద చర్మ వ్యాధి, గొంతు వాపు వ్యాధి తదితర రోగ లక్షణాలు, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఇక్కడ గోపాలమిత్ర సత్యనారాయణ, గ్రామస్థాయి పశు వైద్య సహాయకులు వల్లిక యశోద, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొని సేవలందించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

గరిశింగిలో అడిషనల్ డీఎంహెచ్‌వో జ్యోతి ఆకస్మిక తనిఖీ



గరిశింగిలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్‌డీఎంహెచ్‌వో జ్యోతి

దేవరాపల్లి: ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం ద్వారా క్షేత్ర స్థాయిలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందించే అవకాశం లభించిందని అడిషనల్ డీఎంహెచ్‌వో జ్యోతి తెలిపారు. ఈ మేరకు గరిశింగిలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలపై స్థానికులను ఆరా తీశారు. అనంతరం స్థానిక హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడ అందిస్తున్న సేవలపైన ఆరా తీశారు. ఈ సెంటర్‌లో 105 రకాల మందులను, 14 రకాల పరీక్షలను చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా వైద్య సేవలందిస్తున్నారని స్థానికులు చెప్పడంతో వైద్యాధికారి ఎస్. లలితను, వైద్య సిబ్బందిని అభినందించారు. అనంతరం తెనుగుపూడి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై స్థానికులను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

89 మందికి వైద్య పరీక్షలు

కె.కోటపాడు: అపిడమిక్ సీజన్ సమయాల్లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శనివారం దాలివలసలో 89 మందికి ఓ.పి ద్వారా వైద్య సేవలందించారు. అచేతన రోగుల ఇళ్లకు వెళ్లి ముగ్గురిని వైద్యాధికారి పరీక్షించి మందులిచ్చారు. ఏఎన్‌ఎం నాగమణి, రమణ పాల్గొన్నారు.

గ్రోయిన్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి

ఎంపీ సత్యవతిని కోరిన ఎమ్మెల్యే గణేష్



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, ఇతర నేతలు

మాకవరపాలెం: గ్రోయిన్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ రైతులతో కలిసి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని తూటిపాల, తాడపాల గ్రామాల పరిధిలోని సాగునీరు అందించే గ్రోయిన్ ఐదేళ్ల క్రితం తుపాను వర్షాలకు దెబ్బతింది. ఈ నేపథ్యంలో ఆయకట్టు భూములకు నీరు అందడం లేదు. దీంతో శనివారం ఈ రెండు గ్రామాల రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఎమ్మెల్యే గణేష్ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. రూ.30 లక్షలు మంజూరు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, తూటిపాల సర్పంచ్ గవిరెడ్డి ప్రసాద్, మాజీ సర్పంచ్ రాజారావు, సర్పంచ్‌ల ఫోరం నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు గోవిందరావు, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, యూత్ అధ్యక్షుడు శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ అనుసంధానం

మాకవరపాలెం: విద్యుత్ కనెక్షన్‌లు ఉన్న వారంతా ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని ఆ శాఖ ఏఈ బాలకృష్ణ శనివారం తెలిపారు. చాలా చోట్ల పూర్వీకుల పేరున విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. తమ కార్యాలయానికి వచ్చి వీటిని ప్రస్తుతం తమ వారసుల పేరున ఆధార్ నంబర్లతో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు.